
అక్షరాళ్ల బడి

హెచ్‌సీయూ, మనూ యూనివర్సిటీల్లో హెరిటేజ్ రాక్స్



'పత్తర్ కే దిల్.. ఏక్ తా మే తాకత్ హై.. అనేక్ తా మే ఏకతా.. 'మష్రూమ్ రాక్,.. వైట్ రాక్స్.. టెంపుల్ రాక్'లు హెరిటేజ్ రాక్స్‌గా గుర్తింపు పొందాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన భారీ బండరాళ్లకు పెట్టిన పేర్లు ఇవి. నగరంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న రాతి సంపద హెచ్‌సీయూ, మనూ ఉర్దూ యూనివర్సిటీల్లో ఉండడం విశేషం. నగరంలో గుర్తించిన హెరిటేజ్ రాళ్లలో హెచ్‌సీయూ 'మష్రూమ్‌రాక్' ఉంది. వీటికి శతాబ్దాల చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతుంటారు. వీటి గురించి భావితరాలకు తెలిసేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌సీయూలో 2,300 ఎకరాలు, 'మనూ'లో 200 ఎకరాలు కలిపి 2,500 ఎకరాలలో విభిన్న తరహాలో ఏర్పడిన భారీ బండరాళ్ల (రాక్స్)ను రక్షిస్తూ వస్తున్నారు.

- రాయదుర్గం


- రాక్ సొసైటీ గుర్తింపు పొందిన ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పత్తర్ కే దిల్, ఏక్‌తా మే తాకత్ హై పేర్లు కలిగిన రెండు బండరాళ్లకు మాత్రం 2500 మిలియన్ల ఏళ్ల చరిత్ర ఉందని, దక్కన్ పీఠభూముల్లో భాగం అని చెబుతున్నారు. ముఖ్యంగా నాలుగు బండ రాళ్లలో రెండు రాళ్లు పక్కపక్కనే ఉండడాన్ని గుర్తించి ఈ రాళ్లకు 'పత్తర్‌కే దిల్' అని నామకరణం చేశారు. రాళ్లన్నీ ఒకేచోట ఉండడంతో ఏక్‌తా మే తాకత్ హై (యునైటెడ్ వి స్టాండ్) అని నామకరణం చేశారు. అలాగే మరోచోట ఉన్న రాళ్లకు కూడా అనేక్ తా మే ఏక్‌తా (యూనిటీ ఇన్ డైవర్సిటీ) అని కూడా పిలుస్తున్నారు.



ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఏక్‌తా మే తాకత్ హై'పేరుతో పిలిచే రాళ్లు

రాక్స్ పేరిట వీకెండ్స్ వాక్

- విభిన్న రాష్ట్రాలు, భాషలు, కులాలు, మతాలకు చెందిన వారితో మినీ భారత్‌గా మారిన హెచ్‌సీయూలో విద్యార్థులలో ఐక్యత బలపడేలా చేసేందుకు హెచ్‌సీయూ ఎక్స్‌ప్లోరర్ పేరిట వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు ద్వారా వీకెండ్స్‌లో వాక్‌లను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో మష్రూమ్ రాక్, వైట్ రాక్, టెంపుల్ రాక్, వర్జిన్ రాక్, వైట్ రాక్స్, హైరాక్స్, సాసర్ రాక్, కోన్ రాక్ కాంప్లెక్స్ ఇలా రకరకాల పేర్లతో ఈ బండరాళ్లను విద్యార్థులు పిలుస్తుంటారు.



హెరిటేజ్ రాక్‌గా నగరంలో గుర్తింపు పొందిన మనూలోని పత్తర్ కే దిల్





యూనిటీ ఇన్ డైవర్సిటీ- 'అనేక్ తా మే ఏక్‌తా' పేరుతో భారీ రాళ్లు



హెచ్‌సీయూలో రాక్స్ వాక్

కాశీ విద్యాపీఠంతో 'మనూ' ఒప్పందం



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సోమవారం వారణాసి మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠం (ఎంజీకేవీపి)తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ముఖ్యంగా విద్యావేత్తలు, పరిశోధన, సలహాలు, శిక్షణ, జ్ఞానాన్ని పంచుకోవడం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, విద్యార్థుల మార్పిడి, రెండు సంస్థలలో ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణపై ఒప్పందం చేసుకున్నారు. 'మనూ' వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్, ఎంజీకేవీపీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్‌త్యాగి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు ఉంటుంది. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సయ్యద్ నజాముల్ హసన్, మహ్మద్ ఫరియాద్, సల్మా అహ్మద్ ఫారూఖీ, సనీమ్‌ఫాతిమా,అబ్దుల్ వాహిద్ పాల్గొన్నారు.

నేడు ,రేపు వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు ఉర్దూ రచయితల వర్క్‌షాప్ జరగనుంది. ఉర్దూ ఉన్నత విద్య కోసం పాఠ్య పుస్తకాలను అభివృద్ధి చేయడానికి, అకడమిక్ రైటింగ్‌పై ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.నూతన విద్యావిధానం -2020కి అనుగుణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, భారతీయ భాషా సమితి (బీబీఎస్) ద్వారా చొరవ తీసుకుంది. మనూ నోడల్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. మంగళవారం ఉదయం 11 గంటలకు 'మనూ'లోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ఈ ప్రారంభ కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, యూజీసీ కార్యదర్శి, ఉస్మానియా మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్దిఖీ, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఇంతియాజ్ హసన్, 'మనూ', ఇతర విశ్వవిద్యాలయాలకు చెందిన 60 మంది రచయితలు ఇందులో పాల్గొంటారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు కిలోల్లో.. టమాట రూ. 55, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 65, కాకరకాయ 38, బీరకాయ 45, క్యాబేజీ 23, బీన్స్ 95, క్యారెట్ 40, గోబిపువ్వు 23, దొండకాయ 38, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 25, క్యాప్సికం 70, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 35, సొరకాయ 25, పొట్లకాయ 23, కంద 65, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 29, మామిడికాయ 15-20, అరటికాయ 8- 9, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 35, గుమ్మడికాయ 15, నిమ్మకాయలు 50 -60

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు సోమవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్ కార్పొరేటర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీ వాసులు, అసోసియేషన్ నాయకులు, అభిమానులు, మిత్రులు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్‌చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పించాలి



తిరుమలరావు

ఆల్విన్‌కాలనీ: శబరిమలలో ఈ మకరవిలుక్కు నుంచి 80 వేల మందిని మాత్రమే దర్శనానికి అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని శబరిమల మణికంఠ స్వామి గ్రూప్, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ డిమాండ్ చేసింది. కలియుగ దైవమైన అయ్యప్పస్వామిని పదునెట్టాంబడిని అధిరోహించి దర్శించుకోవాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షల మంది భక్తులు అయ్యప్ప మాల ధరిస్తున్నారన్నారు. వారంతా మకరవిలుక్కు నుంచి మొదలు జ్యోతి దర్శనం కొరకు స్వామి దర్శనానికి పరితపిస్తూ కఠినమైన దీక్ష చేస్తు దర్శనం కోసం శబరిమల వెళుతుంటారని అక్కడి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు, శబరిమల మణికంఠ స్వామి గ్రూఫ్ ఫౌండర్‌యాప తిరమల్ అన్నారు. ప్రభుత్వం మాత్రం భక్తుల మనోభావాలను పక్కన పెట్టి రోజుకి కేవలం 80 వేల మందికి మాత్రమే దర్శనం వర్చువల్ క్యూ ద్వారా కల్పించటం సరైనది కాదని అన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని శబరిమల చేరుకుని అయ్యప్పను దర్శించుకునే భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా అక్కడి ప్రభుత్వం, ట్రావెంకోర్‌దేవస్వం బోర్డు చర్యలు చేపట్టాలన్నారు. స్పాట్ బుకింగ్ సైతం అమలు చేసి భక్తులకు అయ్యప్ప దర్శనం కలిగించాలని కోరారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఉన్న అయ్యప్ప భక్తులను ఏకతాటి పైకి తీసుకువచ్చి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

గుడ్లగూబను కాపాడిన ఫైర్‌సిబ్బంది



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులో సోమవారం ఉదయం రావి చెట్టుపై గుడ్లగూబ మాంజాకు వేలాడుతూ విలవిలలాడుతోంది. దీంతో స్థానిక మహిళలు 100 కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే జూబ్లీహిల్స్ ఫైర్ సిబ్బంది, స్థానిక నాయకులు కలిసి గంటల తరబడి శ్రమించి గుడ్లగూబను మాంజా నుంచి విముక్తి కల్పించడంతో ఎగిరిపోయింది.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు



ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నరసింహులును సోమవారం యువనేత దొడ్ల రామ్యకృష్ణగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్‌అలీ మున్నా, యాదగిరి, సంగమేష్, మహేష్, మజర్, ఫారూఖ్, ఖలీమ్, మల్లేష్, నాగరాజు, సంతోష్ బిరాదర్, ఉమేష్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా



కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కొంపల్లి మున్సిపల్, నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను శ్రీశైలంగౌడ్‌కు విన్నవించగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగుచర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని, అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

మరమ్మతులు చేపట్టండి



జగద్గిరిగుట్ట: రింగ్ బస్తీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'మినీ ఇండియా' శేరిలింగంపల్లి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- నానక్‌రాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నఎంపీ రఘునందన్‌రావు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గం 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందిందని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నానక్‌రాంగూడలోని హనుమాన్ ఆలయం వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో అత్యధికంగా నార్త్ ఇండియన్స్, ఐటీ ఉద్యోగులు ఉంటారని, ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ సభ్యత్వం స్వీకరించేలా చూడాలని సూచించారు. శేరిలింగంపల్లిలో 8 లక్షల ఓటర్లు ఉన్నారని పార్టీ కార్యకర్తలు, నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం నానక్‌రాంగూడలో దుకాణాలకు వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో రఘునందన్‌రావుతోపాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు వైష్ణవి

కుత్బుల్లాపూర్: ఖేలో ఇండియా సౌత్ జోన్ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్-2లోని శ్రీనిధి గ్లోబల్ స్కూల్ విద్యార్థి వైష్ణవి ఎంపికైంది. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వైష్ణవి ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనిధి స్కూల్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ప్రెసిడెంట్ మేడమ్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ ఎస్.కోమలా దేవి, పీఈటీ శ్రీకాంత్ విద్యార్థి వైష్ణవిని అభినందించారు.



మెరుగైన సదుపాయాలకు సమష్టిగా పనిచేయాలి



నిజాంపేట్: మౌళిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు సమష్టిగా పని చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన పలు విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది మేయర్ నీలారెడ్డి దంపతులను కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ మెరుగైన సేవలు అందించాలని అన్నారు.

గంట వర్షానికే.!

ఎక్కడికక్కడ నిలిచిపోయిన వరదనీరు

నిజాంపేట్: గంట పాటు కురిసిన భారీ వర్షంతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం పడటంతో ఆదిత్య గార్డెన్ కాలనీ, సాయి నగర్ కాలనీ, ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ తదితర ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది. దీంతో మోటార్ల సహాయంతో నీటిని బయటకు తోడారు. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. సందట్లో సడేమియా అన్నట్లుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధాన రోడ్డులో ఉన్న గుంతల్లోకి వరద నీరు చేరడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.



మోకాళ్ల లోతు వరకు 200 మీటర్ల మేర నిలిచిన నీరు..

సుభాష్‌నగర్: భారీ వర్షానికి సూరారంలోని ప్రధాన రోడ్డులో మరోసారి పెద్ద ఎత్తున నీరు చేరింది. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డులో మోకాళ్ల లోతు వరకు 200 మీటర్ల పొడవు మేర నీళ్లు నిలిచాయి.



సాయి పూజ థియేటర్, నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద రెండు కల్వర్టును మూసేయడం వల్లనే వర్షం పడిన ప్రతిసారి ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కల్వర్టులను కబ్జా చేసిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఓ చోట రోడ్డు ఉండదు.. మరోచోట మురుగు పారని రోజు ఉండదు!



సీసీరోడ్డు లేకపోవడంతో బురదగా ఉన్న రోడ్డు



రోడ్డుపై మురుగు పారడంతో రోడ్డుపై మురుగు

జీడిమెట్ల: రాంరెడ్డినగర్‌లో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని రాంరెడ్డినగర్‌లో కొన్ని రోడ్లు ఇప్పటికీ సీసీరోడ్లు వేయకపోవడంతో ఇంకా మట్టిరోడ్లుగానే ఉన్నాయి. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్లపై వర్షపునీరు నిలవడంతో రోడ్లు బురదమయంగా మారుతున్నాయని ప్రజలు అంటున్నారు. రోడ్లపై నీరు నిలవడంతో మట్టిరోడ్లు మొత్తం బురదమయంగా అవుతున్నాయని రోడ్లపై నడవడం ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని సీసీరోడ్లు లేని చోట రోడ్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ డ్రైనేజీ అస్తవ్యస్తం..

రాంరెడ్డినగర్‌లోని కొన్ని రోడ్లలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌లో ఔట్‌ఫ్లో సరిగా లేకపోవడంతో ప్రతిరోజు మురుగు పారుతోంది. దీంతో తీవ్రమైన దుర్వాసన వస్తోందని కాలనీవాసులు అంటున్నారు. ప్రతిరోజు భూగర్భడ్రైనేజీ ఔట్‌ఫ్లో సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పాత భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ స్థానంలో కొత్త భూగర్భ డ్రైనేజీ పైపులైను ఏర్పాటు చేసి ఔట్‌ఫ్లో సరిగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



కూకట్‌పల్లి: బీఆర్‌యస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కె.వి. వివేకానంద్, కాలేరు వెంకటేష్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

సైబరాబాద్ తరపున ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ప్రాతినిధ్యం

జీడిమెట్ల: తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న డ్యూటీ మీట్ కార్యక్రమానికి సైబరాబాద్ తరఫున ప్రాతినిధ్యం వహించడానికి జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్ సెలెక్ట్ అయ్యారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారి నిర్వహిస్తున్న డ్యూటీ మీట్ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించేందుకు పరీక్ష నిర్వహించగా అందులో జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ మల్లేష్ ప్రతిభ కనబరిచారు. అందుకు గాను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి గడ్డం మల్లేష్‌ను సెలెక్ట్ చేశారు. సైబరాబాద్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం తనకు రావడం పట్ల ఇన్స్‌పెక్టర్ మల్లేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు జీడిమెట్ల పీఎస్‌లో పనిచేసే సబ్ ఇన్స్‌పెక్టర్స్, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

జీవీపీ ఏర్పాటుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాండ్‌లో చెత్త కలెక్షన్ పాయింట్ (జీవీపీ) ఏర్పాటుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బస్టాండ్ నిత్యం వందలాది బస్సులు, ఆటోలు, హమాలీ కార్మికులు, ఇతర వ్యాపార సముదాయాలు ఎప్పుడూ కిక్కిరిసిపోతుంది. ప్రతీ రోజు చుట్టుపక్కల కాలనీల నుంచి కార్మికులు చెత్తను సేకరించి ఆ డబ్బాలను ఈ బస్టాండ్‌లో ఉంచుతున్నారు. దీంతో ఇటు ప్రయాణికులు, అటు వ్యాపారస్తులకు తీవ్ర సమస్యగా మారింది. ఈ కలెక్షన్ పాయింట్‌ను ఇక్కడి నుంచి వీలైనంత తొందరగా వేరే ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.